
# మృత్యువునెదిరిస్తూ...

- అర్చనా చౌహాన్



మీరెప్పుడైనా మృత్యువు మొహంలో మొహం పెట్టి చూశారా?

నేడో రేపో...

ఇప్పుడో అప్పుడో...

ఈ క్షణమో ఆ క్షణమో అని క్షణాలు లెక్కబెట్టుకున్నారా?

దగ్గరలో... అతి దగ్గరలో... అత్యంత చేరువలో... మృత్యువు నీడ మీ నీడతో కలిసిపోవడం చూశారా?

పోని వేరే ఎవరినైనా ఆ పరిస్థితిలో చూశారా?

మరణశయ్య మీద పడుకుని... మృత్యువు కోసం ఎదురు చూస్తూ... క్షణమొక యుగంగా... యుగాలను లెక్కబెడ్తూ... ఎవరికీ తెలియని అజ్ఞాత లోకంలోకి మోసుకెళ్లే ఆ రాయబారి కోసం నిరీక్షిస్తూ...

ఎలా ఉంటుందీ?

ఆ ఫీలింగ్... ఆ అనుభవం... ఆ అనుభూతి... ఎలా ఉంటుందీ?

చినమావయ్య వద్దనించి అకస్మాత్తుగా ఉత్తరం వచ్చింది. ఆయన దగ్గర్నించి వచ్చిన మొట్టమొదటి ఉత్తరం అది. ఆ మొదటి ఉత్తరం రావడం రావడమే దుర్వార్తను మోసుకురావడం నిజంగా దురదృష్టకరం. చిన్నమావయ్యకి థ్రోట్ క్యాన్సరట. చాలా సీరియస్‌గా ఉందనీ, వెంటనే రమ్మనీ!

ఆ వార్త అందగానే అమ్మా, నేనూ హుటాహుటిన బైలుదేరాము. దారి పొడుగునా అమ్మ కళ్లు ఒత్తుకుంటూనే ఉంది. తమ చిన్ననాటి సంగతులను గుర్తు చేసుకుంటోంది. అందులో సగం నేను అంతకు ముందు ఎన్నో సార్లు విన్నవే!

మావయ్య తన పెళ్లి విషయమై తాతయ్యతో ఘర్షణపడి ఇల్లు వదిలి వెళ్లిపోయార్ట.

అంతే! ఆ తర్వాత ఎప్పుడూ తిరిగి రాలేదు. ఎక్కడ, ఎలా ఉన్నారో కూడా ఎవరికీ సరిగ్గా తెలీదు.

మిలటరీలో చేరారనీ, ఆ తర్వాత కొన్నాళ్లకి అది కూడా వదిలేసి ఏదో ఉద్యోగం చూసుకున్నారనీ భోగట్టా!

ఏవో కొన్ని ఫొటోల్లో తప్పిస్తే నేను చిన్న మావయ్య నెపుడూ చూడలేదు.

అందుకే కాబోలు అమ్మ సంగతెలా ఉన్నా నా మనసులో మాత్రం రకరకాల భావనలు కలగాపులగంగా ఉన్నాయి. అమ్మతో కలసి అలా వెళ్లటం కాస్త వింతగానూ, ఇంకాస్త ఉద్విగ్నంగానూ అనిపించింది. ఇన్నాళ్లూ కేవలం కథల్లో విన్న మనిషిని ప్రత్యక్షంగా చూడబోతున్నందుకు కాబోలు!

చిత్రంగా ఆయనకి క్యాన్సర్ ఉందన్న విషయం నన్ను పెద్దగా కదిలించలేదు. ఒక ఆగంతకునికి అలాంటి భయంకరరోగం ఉందని తెలిస్తే ఎంతగా బాధపడ్తామో కేవలం అంతే బాధపడ్డాను. అందుకే కాస్త గిల్టీగా ఫీలయ్యాను కూడా.

ఎలాగైతేనేం నేనూ, అమ్మ చివరికి మావయ్య ఇంటికి చేరుకున్నాడు.

ఇల్లంతా చుట్టాలతో నిండి ఉంది.

తాతయ్యా, అమ్మమ్మా, పెద్దమావయ్య, పెద్దత్తయ్య, చిన్నమ్మ, పెద్దమ్మ, ఇంకా ఎవరెవరో.

అందరి ముఖాల్లోనూ విషాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఆడవాళ్లంతా పైట కొంగులను నోట్లో దోపుకుని ఏడుపును దిగమింగే ప్రయాసలోనో లేదా చెంగు కొసలతో కళ్లు తుడుచుకుంటూనో తిరుగుతున్నారు.

అమ్మమ్మ అమ్మని చూడగానే వాటేసుకుని బావురుమంది. అమ్మ కూడా వెక్కుతోంది.

"రుద్ర ఎక్కడ?" వెక్కిళ్ల మధ్య అడిగింది. అమ్మమ్మ ఓ గది వైపు చూపించింది. అమ్మ నన్ను వెంటబెట్టుకుని గదిలోకి వెళ్లింది.

అక్కడంతా జనం నిండి ఉన్నారు. అంతమంది ఉన్నా అక్కడ మౌనం రాజ్యమేలుతోంది.

అంతా మౌనంగా మంచంవైపు చూస్తున్నారు. అక్కడ మంచం మీద పొడుగ్గా, బక్క పలుచగా ఉన్న ఒక వ్యక్తి పడుకుని ఉన్నాడు చిన్న మావయ్య!

నేను విస్మయంగా చూశాను. ఫొటోల్లో ఎత్తుగా, బలంగా, ఠీవిగా కనిపించే ఆ వ్యక్తీ, నీరసంగా మంచానికి అంటుకుపోయినట్లున్న ఈ వ్యక్తీ ఒకరే నంటే నమ్మశక్యంగా లేదు. అతను అమ్మకంటె వయసులో చిన్నవాడైనా ఓ పదేళ్లు పైబడిన వాడిలా ఉన్నాడు.

గొంతులో క్యాన్సర్ వల్ల ఏదీ మింగుడు పడ్డం లేదట. అందుకని ఒక చిన్న గొట్టాన్ని గొంతులో అమర్చారట. అయినా ద్రవపదార్థాలు తప్పిస్తే ఏమీ సయించదట.

ప్రస్తుతం ఆ ద్రవపదార్థాలు కూడా అతి కష్ట మ్మీద తీసుకోవాల్సి వస్తోంది. మనిషి మాట్లాడ లేడు. బలహీనత వల్ల అస్సలు లేవలేడు కూడా.

డాక్టర్లు కూడా జవాబిచ్చేశారట. నిర్లక్ష్యం వల్ల క్యాన్సర్ ముదిరి పోయిందనీ, ఇప్పుడేమీ చేయ టానికి వీల్లేదని అన్నారట. అందుకే ఆ వ్యక్తి ప్రస్తుతం ఆఖరి దశలో ఉన్నాడు. మృత్యువు కోసం ఎదురు చూస్తున్నాడు.

అతని చుట్టూ ఉన్నవారు కూడా అంతే! ఒక విధంగా అతను ఎప్పుడు పోతాడా అని ఎదురు చూస్తున్నారు.

ఆ నిస్సహాయ స్థితి నిజంగా చాలా దయ నీయంగా ఉంది. దుర్భరంగా ఉంది.

అప్పటి వరకూ నాలో కలగాపులగంగా రగులు తోన్న భావాలు ఎటు పోయాయో తెలీదు. ఆ అపరిచిత వ్యక్తిపై, అంతకంటే అతన్ని ప్రేమించే అతని ఆత్మీయులపై ఎనలేని సానుభూతి కలిగింది.

నేను అంతకు ముందెప్పుడూ అలాంటి పరిస్థితిని చూడలేదు. సినిమాల్లో చూపించే 'డ్రమెటిక్‌సీన్స్' తప్పిస్తే అలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం మొదటిసారి. నిజం చెప్పాలంటే అసలు ఎలా ప్రతిస్పందించాలో కూడా తెలియలేదు.

ఇంతలో వెనక గాజుల గలగల శబ్దం విని వెనక్కి తిరిగాను. వంటింట్లో నించి గ్లాసులో ఏదో పట్టుకొస్తోందావిడ.

ఛామనఛాయ. చక్కని ముఖ వర్చస్సు.

వయస్సు ముప్పై, నలభైకి మధ్యలో ఉంది కాబోలు.


కళ్లు చెదర గొట్టే అందం కాకపోయినా ఆకర్షణీయంగా ఉంది. ఆమె ముఖంలో ఇది అని వర్ణించలేని ప్రత్యేకత, ఒక లాంటి కళ ఉట్టిపడ్తోంది. బహుశా దానిక్కారణం నుదుట దిద్దిన రూపాయి కాసంత కుంకుమ కాబోలు!


ఊహు! తల్లో ముడిచిన కనకాంబరాలేమో!

మెళ్లో నల్లపూసల గొలుసుతో చుట్టుకుపోతున్న పసుపుతాడేమో!

లేక చేతి నిండుగా వేసుకున్న ఆ మట్టి గాజుల తళతళా!

ఆవిడ నాకు చిన్నత్తమ్మ అని ఎవరూ చెప్పకనే తెలిసింది.






ఆవిడ పెద్దగా చదువుకోలేదని విన్నాను.

పేరు మాయ!

నాకు తెలిసి అలాంటి వేషధారణ బహు కొద్ది మందిలో చూశాను. అమ్మతో తిరిగే హై సొసైటీ మహిళలు చాలా డిఫరెంట్‌గా ఉంటారు. అందుకే ఈవిడ నాకింత ప్రత్యేకంగా అనిపిస్తుందేమో!

ఆవిడ వస్తోంటే ఎవరో "ఇదిగో మాయా! నీ ఆడపడుచు వచ్చింది చూడు'' అన్నారు. ఆవిడ సంభ్రమంగా అమ్మ వైపు తిరిగి చప్పున వంగి కాళ్లకు నమస్కారం పెట్టింది. అమ్మ ఆమెను కావిలించుకుని భోరుమంది.

మాయత్తమ్మ అమ్మ వీపు తట్టి ధైర్యం చెబుతోంది. కాసేపు అయ్యాక "ఆయనకి రసం ఇచ్చి వస్తానొదినా! మీరు ఇప్పుడే వచ్చారు. విశ్రాంతి తీసుకోండి. తర్వాత మాట్లాడుకుందాం' మంద్ర స్వరంలో చెప్పి సున్నితంగా అమ్మని తప్పించుకుని ముందుకెళ్లింది.

మావయ్యని లేపి దిండు సర్ది కూర్చుండబెట్టి రసం పట్టోంది. మావయ్య అతి కష్టమ్మీద తాగగల్గుతున్నాడు.

ఆ తతంగం పూర్తవడానికి కాసేపు పట్టింది. ఆ మాత్రం ప్రయాసకే మావయ్య అలసిపోయినట్లు స్పష్టంగా తెలుస్తోంది. తిరిగి ఆయనను పడుకో బెట్టబోతే వద్దంటూ వారించి అలాగే కూర్చున్నారు.

అమ్మ ముందుకెళ్లి మావయ్య చేతులు పట్టుకుని కూర్చుంది. ఇన్నేళ్లుగా చూడని అక్కని కళ్ల నిండుగా చూస్తున్నట్టు చూస్తున్నారు. అమ్మ ఏకధాటిగా ఏడుస్తూనే ఉంది.

ఊరుకోమన్నట్లు మావయ్య ఎంత సైగ చేసినా ఆమె ఏడుపు ఆగట్లేదు.

ఎంతకీ ఆ ఉధృతం తగ్గకపోయేసరికి ఎవరో అమ్మని బైటికి తీసికెళ్లిపోయారు.

నేనూ వెనకే వెళ్లబోయాను.

"కీర్తి! నిన్ను చూడాలని మావయ్య ఎప్పట్నించో అంటున్నారు. రా, పరిచయం చేస్తాను'' కళ్లు వత్తుకుంటూ చిన్నమ్మ నన్ను వెనక్కి లాగింది.

"రుద్రా! ఇదిగో నీ మేనకోడలు కీర్తి'' అంది.

మావయ్య ముఖంలో ఆనందం కనిపించిది. కళ్లతోనే పలకరిస్తూ ఆప్యాయంగా తల నిమిరారు. అత్తమ్మ కూడా చిన్న చిరునవ్వుతో నన్ను పలకరించింది.

మావయ్య తన పక్కనే కూర్చోమని సైగ చేస్తే కాస్తంత తటపటాయించి కూర్చున్నాను.

మావయ్య ఏదో అన్నారు.

ఆయనేదో అడుగుతున్నారని అర్థం అయింది కానీ ఏం అడుగుతున్నారో మాత్రం సరిగ్గా అర్థం కాలేదు.

వెనక్కి తిరిగి ప్రశ్నార్థకంగా చిన్నమ్మ కేసి చూశాను.

మావయ్య మళ్లీ తన సైగను రిపీట్ చేస్తూ నోటితో అంటున్నారు. మాట పెగల్లేదు గానీ గుస గుస వినిపిస్తోంది. అత్తమ్మ ముందుకి వంగి ఆయన చెబుతున్నది వింది.

'కీర్తి! నీ వయసెంతని అడుగుతున్నారమ్మా!' అంది.

"పంతొమ్మిదండి.'' నా గొంతు పూడుకుపోయి ఉందని గ్రహించి నేనాశ్చర్యపోయాను.

మావయ్య కళ్లు కూడా ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

"పంతొమ్మిదేళ్లా?!'' ఇప్పుడా పెదవుల కదలికని నేను పట్టగలిగాను.

"ఇన్నేళ్ల తర్వాత అదీ ఇలాంటి పరిస్థితిలోనా కలుస్తున్నాం?''

సైగలూ, పెదాల కదలికలకూ అదీ అర్థం.

అలా అంటున్నప్పుడు ఉన్నట్టుండి మావయ్య కళ్లలోంచి నీరు ఒలికింది.

నా కళ్లు కూడా చెమ్మగిల్లాయి. కింది పెదవిని బిగపట్టి ఏడుపు నాపుకునే విఫల ప్రయత్నం చేస్తున్నాను.

చుట్టూ ఉన్నవారిలో కూడా కలకలం చెల రేగింది. ఏడుపులూ, వెక్కిళ్లు వినబడుతున్నాయి.

మావయ్య కళ్లలోంచి ధారాపాతంగా నీరు కారసాగింది.

అంతలో అత్తమ్మ ముందుకి వంగి తన పైట చెంగుతో ఆయన చెంపల మీదుగా కారుతున్న కన్నీటిని తుడిచింది. అలా తుడుస్తున్న క్షణంలో ఆమె ముఖంలో కనిపించిన ఆత్మస్థైర్యం, నిగ్రహం నన్ను అమితంగా ఆకట్టుకున్నాయి.

ఆ దృశ్యం నా మదిలో ముద్రించుకుపోయింది.

మరణ శయ్య మీదున్న భర్త బేలగా, పసి పాపలా ఏడుస్తుంటే ఓదారుస్తున్న ఆ స్త్రీ మూర్తి అంతర్మథనం ఎవరికి తెలుసు?

ఆ చిన్న చర్యకి ఎంత శక్తిని కూడదీసుకోవలసి వచ్చిందో, ఎంతటి మనోనిబ్బరం అవసరమైందో ఎవరు చెప్పగలరు?

ఆమె నిజమైన మనఃస్థితిని ఎవరు అంచనా వెయ్యగలరు?

కానీ ఆ క్షణంలో, ఆ గదిలో... ఆ ఇంట్లో ఎవరికీ లేని ఇంగితజ్ఞానం, పెద్ద చదువులు చదివిన వారికి సైతం లేని సంస్కారం ఆమెకి ఉన్నాయి.

మరణించబోతున్న ఆ వ్యక్తికి-ఏడ్చి పెడ బొబ్బలు పెట్టి ఏదో దారుణం జరుగుతోందని గుర్తు చేసి మరింత బేలగా తయారు చేసే బదులు అతనికి ధైర్యానిస్తూ మిగిలిన కొద్ది సమయాన్ని ప్రశాంతంగా గడిపేట్లు చూస్తే బావుంటుంది కదూ?

తన తర్వాత కూడా తన వాళ్లు ధైర్యంగా ముందుకు సాగగలరన్న ధీమా... ఆ హామీ అతనికి ముఖ్యం కదూ?

మరో రెండురోజుల్లో మావయ్య పోయారు. శవం పక్కన నిస్త్రాణంగా కూర్చున్న మాయత్తమ్మని చూసి-

"ఇదేం చోద్యమమ్మా! అలా నిమ్మకి నీరెత్తి నట్టు కూర్చుందీ?'' అని ఒకరిద్దరు గుసగుస లాడటం నా చెవిన పడింది.

బహుశా ఆమె అందరిలా దీర్ఘాలు తీస్తూ, శోకాలు పెట్టి ఉంటే ఆ కామెంట్ రాకపోవునేమో!

కాని ఆమె కళ్ల కింది నల్లని వలయాలు, పీక్కుపోయిన ముఖం, అన్నీ పోగొట్టుకున్న బైరాగిలా కూర్చున్న తీరు... బాధని ఏడుపుతోనే కొలవాలా?

ఏమో!

నాకు మాత్రం బొట్టు, పూలు, పసుపుతాడు, గాజులు లేక పోయినా ఆ ముఖంలోని కళ తగ్గినట్లు అనిపించలేదు. ●